# ఊరూరా ప్రచారోత్సాహం

- బీఆర్ఎస్ అభ్యర్థి 'పాడి' ప్రచారానికి నీరా'జనం'
- ఘన స్వాగతం పలుకుతున్న ప్రజానీకం
- ఆకట్టుకుంటున్న కౌశిక్‌రెడ్డి ప్రసంగం



ఇల్లందకుంట మండలంలో భారీగా తరలివచ్చిన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట, నవంబర్ 3: బీఆర్ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి బుధవారం నుంచి నియోజకవర్గంలో ప్రచారానికి శ్రీకారం చుట్టగా, ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నది. ప్రచార ర్యాలీకి అన్ని వర్గాల వారు భారీగా తరలివస్తూ అడుగడుగునా ఘనంగా స్వాగతం పలుకుతున్నారు. ముఖ్యంగా మహిళలు పూల వర్షం కురిపిస్తూ, మంగళ హారతులు పడుతూ అభిమానాన్ని చాటుకుంటున్నారు. కౌశిక్‌రెడ్డి ప్రచారం ఊరూరా ఉత్సాహాన్ని నింపుతున్నది. ఇక ప్రచారంలో అభ్యర్థి కౌశిక్‌రెడ్డి ప్రసంగం సర్వత్రా ఆకట్టుకుంటున్నది. బీఆర్ఎస్ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, మ్యానిఫెస్టో అంశాలను వివరిస్తూ ముందుకు సాగుతున్నారు.

### ప్రజలతో మమేకమవుతూ..

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందు నుంచే మండలి విప్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను పలుసార్లు కలియతిరిగారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను వేర్వేరుగా నేరుగా కలిశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడికక్కడే పరిష్కరించే ప్రయత్నం చేశారు. అలాగే యువత, పలు సంఘాలతో సమావేశమయ్యారు. ఇదే క్రమంలో ఇటీవల హుజూరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థిగా సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో తన జోరును పెంచారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో ఊపు తెప్పించారు. పలు పార్టీలకు చెందిన నాయకులు గులాబీ కుండువా కప్పుకొన్నారు. ఇటీవల యువగర్జన పేరుతో భారీ ఎత్తున నియోజకవర్గ యువతతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశం విజయవంతం కావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో మరింత జోష్ పెరిగింది. పార్టీ క్యాడర్ కూడా అదే స్థాయిలో పనిచేస్తున్నది.

### నిరంతరం ప్రజల మధ్యే..

పాడి కౌశిక్‌రెడ్డి ప్రతిపక్షాలు ఊహించని తరహాలో షెడ్యూల్ ఖరారు చేసుకున్నారు. రోజులో 20గంటలు ప్రచారంతోపాటు ప్రజలు, పార్టీ శ్రేణులను కలిసేందుకు సమయాన్ని వెచ్చిస్తున్నారు. ఇదే క్రమంలో గత బుధవారం కమలాపూర్ మండలంలో ప్రచారం ప్రారంభించి, హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండల కేంద్రాలు, గ్రామాల్లో తిరుగుతున్నారు. ఒక్కో రోజు నాలుగైదు గ్రామాలు.. నాలుగైదు మున్సిపల్ వార్డుల్లో ప్రచారం చేస్తున్నారు. విజయోత్సవ ర్యాలీగా ప్రచారం సాగుతున్నదని సర్వత్రా చర్చ సాగుతున్నది.

### పతితో పాటు సతీ

బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి సతీమణి శాలినీ రెడ్డి కూడా ప్రచారంలో భాగస్వామ్యమవుతున్నారు. రోజూ ఉదయం నుంచి రాత్రి వరకు కౌశిక్ వెంటే ఉండడంతోపాటు ఆమె కూడా ప్రసంగిస్తున్నారు. కొన్ని గ్రామాలు, వార్డుల్లో నేరుగా స్థానిక నాయకులు, మహిళలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఓటు అభ్యర్థిస్తుండగా, ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నది. మహిళలు ఆమెను బొట్టుపెట్టి ఆశీర్వదిస్తూ మద్దతు ప్రకటిస్తుండడం, పాడి ప్రచారంలో ప్రజల అభిమానం వెల్లువెత్తుతుండడం బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపుతున్నది.

### నేడు జమ్మికుంటలో 'పాడి' ప్రచారం

జమ్మికుంట, నవంబర్ 3: బీఆర్ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి శనివారం జమ్మికుంటలో ప్రచారం చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం మండలంలోని నగురం, నాగారం, వావిలాల, పాపక్కపల్లిలో... సాయంత్రం మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెం(9,10,11వ వార్డులు)లో ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. అభ్యర్థి కౌశిక్‌రెడ్డితో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దిరెడ్డి, తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రచారానికి భారీ సంఖ్యలో అన్ని వర్గాల ప్రజలు హాజరుకావాలని కోరారు.

## నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన ఎన్నికల అధికారి



ఆర్వో కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 3: హుజూరాబాద్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో శుక్రవారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నామినేషన్ పత్రాలను పూరించడంలో అభ్యర్థులకు సహకరించాలని సిబ్బందికి సూచించారు. పలు అంశాలకు సంబంధించి సూచనలు చేశారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన పలు విభాగాలను పరిశీలించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ రిటర్నింగ్ అధికారి రాజు, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## మొదటి రోజు ఒకే నామినేషన్

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 3: హుజూరాబాద్ శాసనసభ నియోజకవర్గానికి మొదటి రోజు ఒకే ఒక్క నామినేషన్ దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి ఎస్ రాజు శుక్రవారం తెలిపారు. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసినట్లు చెప్పారు. ముందుగా ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారి రాజు కార్యాలయంలోని బోర్డుపై అంటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అభ్యర్థులు ఉదయం 11 నుంచి మూడు గంటల్లోగా నామినేషన్లు వేయాలని సూచించారు. ఆర్వో కార్యాలయంలో అభ్యర్థులకు అధికారులు సలహాలు సూచనలు ఇస్తారని తెలిపారు. నామినేషన్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఏసీపీ లక్కిరెడ్డి జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 3: బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త, వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు నల్ల మండయ్య ఇటీవల మృతి చెందగా, శుక్రవారం దశదిన కర్మ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వర్ధినేని రవీందర్‌రావు, కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, వాకర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల గోవర్ధన్, చింతిరెడ్డి శ్రీనివాసరెడ్డి నివాళులర్పించారు. అలాగే మొండయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, వాకర్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున రెండో విడుతగా రూ.8,316 ఆర్థిక సాయం అందజేశారు. ఇక్కడ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కొలిపాక సారయ్య, వేణు, శ్రీనివాస్, రమేశ్, మతిన్, శ్రీనివాస్, శ్రీధర్‌గౌడ్, అశోక్‌గౌడ్, కే మహేశ్, బీ సమ్మయ్య తదితరులున్నారు.

## గల్లంతైన యువకుడు మృతి

తిమ్మాపూర్, నవంబర్ 3: గన్నేరువరం మండలం ఖాసీంపేటకు చెందిన సందబోయిన అభిలాష్(28) గురువారం రాత్రి కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది, రేణికుంట శివారులో గల మోయతుమ్మెదవాగు బ్రిడ్జి పైనుంచి నీటిలో దూకిన విషయం తెలిసిందే. ప్రత్యక్ష సాక్షుల సమాచారంతో రంగంలో దిగిన పోలీసులు గజఈతగాళ్లతో గాలింపు చేపట్టినా యువకుడి ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం బ్రిడ్జి కింద మృతదేహం నీటిలో తేలింది. గజఈతగాళ్లు, బంధువులు అభిలాశ్ మృతదేహాన్ని పైకి తీసుకువచ్చారు. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. పంచనామా చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం కోసం కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్ఐ ప్రమోద్ రెడ్డి తెలిపారు.

## కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

వీణవంక, నవంబర్ 3: మండలంలోని మామిడాలపల్లి, ఇప్పలపల్లి, చల్లూరు, వీణవంక, కనపర్తి గ్రామాల్లో శుక్రవారం మహిళా స్వశక్తి సంఘాల ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీవోలు, సీసీలు మాట్లాడుతూ, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోవద్దని, కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో వీవో అధ్యక్షులు అడిచెర్ల వరలక్ష్మి, కొలిపాక సునీత, రేణుక, భాగ్యలక్ష్మి, సరోజన, కార్యదర్శులు సుమల్య, లక్ష్మి, ప్రవళిక, మానస, రోజారాణి, సభ్యులు తిరుపతమ్మ, దేవిక, పద్మ, పులాల రాధ, నీల భాగ్య, వరాల రజిత, సీసీలు సూరోజు ఘనశ్యామ్, సుకాసి తిరుపతి, శ్రీకాంత్, రైతులు, హమాలీలు, తదితరులు పాల్గొన్నారు.



వీణవంకలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వీవో అధ్యక్షులు, కార్యదర్శులు, సీసీలు

## 6, 7న ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీలు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 3: ఈ నెల 6, 7వ తేదీల్లో హుజూరాబాద్ మండల స్థాయి పాఠశాల ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో కేవీ వెంకటనరసింహారెడ్డి, మండల ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎస్ సారయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో రావాలన్నారు. 6న 14 సంవత్సరాల బాల బాలికలు, 7న 17 సంవత్సరాల బాలబాలికలకు పోటీలు ఉంటాయని తెలిపారు. హైస్కూల్ హెచ్‌ఎంలు ఆయా తేదీల్లో వ్యాయామ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలన్నారు.

## కిట్స్‌లో కాంపోజిట్ మెటీరియల్స్‌పై వర్క్‌షాప్

హుజూరాబాద్ రూరల్, నవంబర్ 3: మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐఎస్‌టీఈ (ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) ఆధ్వర్యంలో కాంపోజిట్ మెటీరియల్స్‌పై మూడు రోజుల వర్క్ షాప్‌ను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యవక్తగా హాజరైన ప్రిన్సిపాల్ డాక్టర్ కందుకూరి శంకర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కాంపోజిట్ మెటీరియల్స్ అంటే రెండు లేదా అంతకంటే ఎక్కువ పదార్థాలను ఇంజినీరింగ్ పద్ధతుల ద్వారా కలిపి కొత్త మెటీరియల్ తయారు చేయడమని చెప్పారు. వీటిని ఎక్కువగా ఆటోమొబైల్స్, రైల్వే, ఏరోస్పేస్ ఇండస్ట్రీస్‌లలో వాడుతారని తెలిపారు. ఇంజినీరింగ్ విద్యార్థులు ఆయా మెటీరియల్స్ తయారీపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజినీరింగ్ డాక్టర్ ఎంవీ సతీశ్ కుమార్, అకాడమిక్ ఇన్‌చార్జి డాక్టర్ జీ మల్లయ్య, ఐఎస్‌టీఈ కిట్స్ చాప్టర్ కోఆర్డినేటర్ డాక్టర్ యోగేశ్ ఫండలిక్, మెకానికల్ ఇంజినీరింగ్ అధ్యాపకులు ఎస్ రాజేంద్రప్రసాద్, ఏ జాన్సన్, డాక్టర్ ఆకుల కొమురయ్య, వెంకటేశ్, వీ కుమార్, ల్యాబ్ అసిస్టెంట్ లింగమూర్తి, సురేందర్, మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



కాంపోజిట్ ల్యాబినెట్స్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్

# రైతు పక్షపాతి సీఎం కేసీఆర్

- వారిని కంటికి రెప్పలా కాపాడుతున్నారు
- వెనుకటి చీకటి రోజులు రావద్దు అంటే.. బీఆర్ఎస్‌కు అండగా ఉండండి
- పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 3: సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి అని, ఎక్కడా కూడా వారికి ఇబ్బంది కలుగకుండా కంటికి రెప్పలా కాపాడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వరాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి రెండు పంటలకు సాగునీరు, 24 గంటల కరెంట్ ఇస్తున్నారని గుర్తు చేశారు. పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు వీలుగా రైతుల సౌకర్యం కోసం గ్రామాల్లోనే కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. సమైక్య పాలనలో పంటల సాగు కోసం ఎంత అరిగోస పడ్డారో రైతులు గుర్తు చేసుకోవాలని సూచించారు. వెనుకటి చీకటి రోజులు మళ్లీ రావద్దంటే బీఆర్ఎస్‌కు ఓటు వేసి కేసీఆర్‌కు అండగా నిలువాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకుడు వర్ధినేని రవీందర్‌రావు, సోషల్ మీడియా కన్వీనర్ తులసి లక్ష్మణమూర్తి, సీనియర్ నాయకులు మొలుగురి ప్రభాకర్, బత్తుల సమ్మయ్య, కొలిపాక సమ్మయ్య, కాసగోని కిరణ్‌గౌడ్, పోచంపల్లి సదయ్య, వీరన్న, శ్రీనివాస్, సదానందంగౌడ్, రవి, రాజు తదితరులున్నారు.

## గొడిశాలలో కార్డెన్‌సెర్చ్

సైదాపూర్, నవంబర్ 3: మండలంలోని గొడిశాల గ్రామంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్, సైదాపూర్ ఎస్ఐ జన్ను ఆరోగ్యం, కేశవపట్నం ఎస్ఐ లక్ష్మారెడ్డి గ్రామంలో అనుమానితుల ఇండ్లల్లో సోదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.